# రామాయణ కల్ప వృక్షచ్ఛాయ

— శ్రీ జువ్వాడి గౌతమ రావు

కేవల నవ కథాదరణ బుద్ధులైన కొందరు ఇదివరకెన్నిసార్లు ఎందరెందరో వ్రాసిన రామాయణమును మరల వ్రాసినవాడు కవియేమిటి? అనవచ్చును. అనుచునే యున్నారు. ఇదివరకెందరో ఎన్ని విధములుగానో గానము చేసిన రాఘవేశ్వరు చారిత్రమే యిది. అవివేరు, ఇదివేరు. నవీనత కేవలము కథలోనేయుండదు. 'రసము వేయి రెట్లు గొప్పది నవ కథా ధృతిని మించి' అన్నదానిలో చర్చకు తావే లేదు. ఇది మానవులకు ప్రత్యక్షానుభవములో నున్న విషయము గనుక.

ఇంకొక్క విషయము. మెరపు మెరసి మాయమయినట్లు తత్కాల ప్రతిభా విలసనము గలిగినకవి ఏరుకొను వస్తువు వేరు. గాఢ ప్రతిభ కలవాడు ఎన్నుకొను వస్తువు వేరు. మత్తగజవిహారమునకు మడుగులు చాలవు.

వాన కురియును. పడియ కట్టును. కొన్ని జీవు లందులో ప్రవేశించి నానా ప్రకారముగా రొద చేయును. ఎండగాయును. మడుగెండి పోవును. ఆ జీవుల గతియేమైనదో ఎవ్వరికిని తెలియదు.

అందుచేత తిక్కన మహాభారతమే వ్రాయును. పోతన శ్రీమద్భాగవతమే వ్రాయును. కల్పవృక్షకర్త కల్పవృక్షమే వ్రాయును. మరొకటి వ్రాయకూడదా యన్నచో, ఒకటి: నదీ ప్రవాహమునకు కాలువగట్లు చాలవు. రెండు: ఆ కవి తన జన్మసఫలమైనట్లు భావించడు. ఈ 'జన్మ సాఫల్య' మన్నమాట ఆయా కవులే యర్థములో వాడినను, నేను వట్టి 'సెన్స్ ఆఫ్ అఛీవ్‌మెంట్' అని మనవారు వాడుచున్న అర్థములోవాడు చున్నాను. ఎవరికిని అభ్యంతరము ఉండదనుకొందును.

పాఠకులు మన్నించినచో నొక విన్నపము. ఈ తెలుగు దేశములో అసలు గ్రంథము చదువకనే-చక్కగా అధ్యయనము చేయకనే దానిని గూర్చి స్వేచ్ఛగా వ్రాయుటయో, మాటాడుటయో మిక్కిలిగా అలవాటయినది. ఈ రామాయణ కల్పవృక్షము సంస్కృత కావ్యమున కనువాదమనుట అటువంటి వానిలో నొకటి. అయినను. దోషము లేదు. కాదు కనుకనే కాదని చెప్పుట. కథారంభములోనే ఇది స్వతంత్ర కావ్యమని స్పష్టముగా తెలియును. అనువాదమయినచో 'తపస్స్వాధ్యాయ నిరతుడయిన నారదుని తపస్వియైన వాల్మీకి ఇట్లు ప్రశ్నించె' నని మొదలు పెట్టవలయును. కానిచో, అయోధ్యకు రాజు దశరథుడు, అతనికి ముప్పురు భార్యలు అని మొదలు పెట్టవలయును. కాని-.

'ఆత్మ నిత్యమ్ము కాలాద్యవచ్ఛిన్నమ్ము
సచ్చిదానంద సంపచ్చయమ్ము
అద్వితీయమ్మేక మపరిణాను ప్రాప్త
మపరిమేయమ్మది యచ్చతెలివి-'

ఇట్లు మొదలు పెట్టుటయేమి? ఆత్మ లక్షణములనువర్ణించుటకు రామ కథా ప్రారంభమున కేమి సంబంధము? ఏమి సంబంధమనగా కవి తన రామాయణమును దైవములేని కలిలో నాస్తికతా కాలుష్యమును పోద్రోచుటకై ఆత్మ నిత్యత్వ ప్రతిపాదనముతో ప్రారంభము చేయుచున్నాడు. ఇట్లు వ్రాయుట పదిమంది వ్రాసినదానిని తిరుగ వ్రాయుటగాదు. తన కావ్యరచన యుద్దేశ్యమును, పరమార్థమును గుర్తెరిగిన వాడు వ్రాయుట.

ఆత్మయున్నదా? దైవమున్నాడా? నాస్తిక్యత కాలుష్యమా? ఈ ప్రశ్నల కిచ్చుట తావులేదు. తానన్నదానికి వ్యతిరేకముగా జగములో మరొకడు మాటాడగూడదనుట, అందరు తమ మార్గమే పట్టవలయుననుట అభివృద్ధి నిరోధకుని ప్రథమ లక్షణము.

మరియు, రామకథ ఎవని సొత్తు? ఒక్క వాల్మీకి మహర్షికైనను 'ఈ కథనాది' అను అధికారమున్నదో లేదో తెలియదు. 'ఈ ప్రపంచకమెల్ల యెల్లవేళ తినుచున్నయన్నమే తినుచున్న దిన్నాళ్ళ, తన రుచి బ్రతుకులు తనవిగాన; చేసిన సంసారమే సేయుచునున్నది తన దైన యనుభూతి తనదిగాన; తలచిన రామునే తలచెదనేనును నా భక్తి రచనలు నావిగాన......' ఇది వరకెందరో రాసిన రామాయణమున మరలా

వ్రాయుట ఎందుకనగా- ఇది సమాధానము. ఇందులో రెండంశములున్నవి. ఒకటి నా ఇష్టము. రెండవది- దేహధారణమునకు భోజనము చేయుట ఎంత అవసరమో సంసారతరణమునకు భక్తి అంత అవసరము. ఈ దేహమున్నంతవరకు మరల మరల తినుట ఎట్లో, ఈ సంసారమున్నంత వరకు మరల మరల రామకథా స్మరణ మటువంటదని స్ఫూర్తి కనుకనే-

'నైకోద్రిక్త జనుర్నిమిత్తక మదేనః పుంజమున్ తానయో
ధ్యాకాండమ్మది సాహితీ విమల తీర్థం చార్పుతన్......

అనేక జన్మలకు నిమిత్తమయిన పాపపుంజమును సాహితీ విమల తీర్థమైన ఈ రామాయణము ఆర్పునుగాక- అని ప్రార్థన.

'కవితా రూప తపస్సు చేసెదను శ్రీ కంఠ! మనస్సంయమా
దివిధానంబుల చేతగాని తనమైతిన్......'

అని మొర. మనో నిగ్రహాది విధానములతో తపస్సు తనకు సాధ్యము కాలేదు.

'...ఏమికా, మము కోధంబదియేమి ఏమియగునీ మాత్సర్యమోహాప్రభూ!' అని, గుండె నిండ చెప్పరాని బాధతో కవితా రూప తపస్సుతాను చేయుచున్నాడు. తమ సర్వకవితా శక్తిని శ్రీ రామార్పణము చేయుచున్నాడు.

'సద్యోనిర్గతమైన సర్వ కవితా సంభారమున్ నీకు నై
వేద్యం బిచ్చితి రామచంద్ర! ప్రభువా! విశ్వాసముంబూనవే!
ఆద్యంబై చను జీవలక్షణము సంహారంబుగావింపవే!

అందుకొరకే తపస్సు...'... తుది జన్మజేయుము దీని, ధూర్జటీ!' అని చిట్ట చివరి వేడి కోలు.

అసలిది ఎందుకు వ్రాయుచున్నావని అడుగు అధికారము మనకు లేదు. వీలయినచో దాని నుంచి చెడ్డలు విచారింతము; లేనిచో, నూరకుందము. రచనలోని ఆనందము కవిది; పఠనములోని ఆనందము మనది.

ఇది స్వతంత్ర కావ్యమని మొదటనే మనవి చేసితిని. పాఠకునకీకవి యొక్క స్వాతంత్ర్యము, ఆయన త్రొక్కిన క్రొత్త మార్గములు అడుగడుగున కనబడును. దశరథుని ముప్పురు రాణులను ప్రవేశపెట్టుచు కవి-

కౌసల్య ముక్తి కాంతా సమానాకార,
నలి సుమిత్ర యుపాసనా స్వరూప,
విజయ రమాకార వినయాంబుధి సుమిత్ర
కైకేయి మధుసామగాన మూర్తి;
కౌసల్య నవ శరత్కాల మందాకిని,
సిత పుండరీకంబు శ్రీసుమిత్ర,
మందార పుష్పంబు మహిళామణి సుమిత్ర,
కైకేయి నునునల్ల కల్వపూవు;......

అని వ్రాసెను. మనము నిత్యము చదువు నితర కావ్యములలో వర్ణన ఇట్లుండదు. రూపమును గురించిన వర్ణన ఇందసలే లేదు. ఆయా రాణులకు కొన్ని లక్షణములు చెప్పినాడు. మరియు గమనింప వలసినదేమనగా సుమిత్రను కౌసల్యతో గలిపి యొకసారి, కైకేయితో గలిపి యొకసారి చెప్పుచున్నాడు. ఎందుకు? సీస పద్యము నిండుటకా? ముక్తికాంతా సమానాకార, ఉపాసనా స్వరూప, రమాకార, వినయాంబుధి, సామగానమూర్తి- ఈ యీ విశేషణములు వట్టివేనా? ఏమయిన అర్థమున్నదా?

రామ లక్ష్మణులొక జంట, భరత శత్రుఘ్నులొకజంట. కౌసల్య రాముని తల్లి- అందుచేత ముక్తి కాంతా సమానాకార. లక్ష్మణుడు పాసనా స్వరూపుడు. శత్రుఘ్నుడు విజయమునకు, వినయమునకు ప్రతీక. భరతుడు పరమ భాగవత శేఖరుడు. అతనిని కన్న కైకేయి సామగాన మూర్తి. సుమిత్ర కవలలను కన్నది. ఒకడు రాముని జంట, మరొకడు భరతుని జంట. అందుచేత ఆమె నొకసారి కౌసల్యతో, మరొకసారి కైకేయితో కలిపి చెప్పుట.

మరియు, నవశరత్కాలమందారిని కౌసల్య. స్వచ్ఛమైనది, శాంతమైనది. ఆమెత నున్న సుమిత్ర సితపుండరీకము. తెల్లని తామరపూవు. కైకేయి నును నల్ల కల్వపూవు రాజునకు మిక్కిలి ప్రియమయినది. ఉద్రేకము కలిగించునది. ఆమెతోనున్న సుమిత్ర ఎఱ్ఱని మందారము. స్పృహణీయములుగా నున్నవని పూవుల పేర్లు చెప్పుటకాదు; వారి గుణములు చెప్పుట.

కల్ప వృక్ష కావ్యములో కైకేయిని తీర్చిన తీరేవేరు. మన కిదివరకు తెలిసిన కైకేయి మిక్కిలి స్వార్థపరురాలు. సర్వజన ప్రియుడైె రాముని స్వార్థమునకై యడవికి పంపినది. కులఘ్ని, పతిఘ్ని. ఇది కల్పవృక్షమునకు పూర్వమున్న కైకేయి.

కైకకు రామునియందమితమైన ప్రేమ. ఆయనకు నంతే! కాళ్లు వచ్చిన దాదిగా కైక కొరకు పరుపులెత్తును శ్రీరామ భద్రమూర్తి. నిద్ర మేల్కొన్నదిగ రామ భద్రుకొరకు అంగలార్చుచు జను ప్రియాత్మ జాత! ఆమె రామునికి విలువిద్యలోని మెలకువలు నేర్పినది.

'పటుబాహ్ పటు మూర్తి స్వామి ధనురభ్యాసంబు నిత్యంబుసే
యుటయున్ కైకయి వచ్చి చూచుటయు......'
'ఎలమిన్ తానిది వేళ పాళయనిలే, దెల్లప్పుడున్ రామచం
ద్రులు తానన్ఁదన కార్ముకంబు నడి జేరున్ కైకయీ సౌధముల్...'
'తన విల్లేగతి బట్ట అమ్ము నెటుసంధానింప కైకేయి శా
సనమే శాసనమా రఘూత్తమునకున్...'

ఇది కైకేయి రామునకు విలువిద్య నేర్పిన తీరు. రామునికి 'చాప విద్యా' గురువు కైకేయి. అస్త్రవిద్యా గురువు విశ్వామిత్ర మహర్షి. వీరిరువురును భవిష్యద్దైత్య సంహారమునకుగా రాముని తీర్చి దిద్దినవారు. సీతా రాముల కళ్యాణముతో తన బరువు దించికొని జగజ్జేగీయ మానముగా బయటపడినవాడు విశ్వామిత్రుడు. కైకేయిపని అంతటితో పూర్తి కాలేదు. శ్రీ రాముడడవికి పోయినగాని అసలు రామాయణము మొదలుకాదు. ఆ పని చేయగలది సర్వాయోధ్యలో కైకేయి ఒక్కతెయే. కల్పవృక్షములోని కైకేయి ఆ పనిని తాత్కాలికపుత్రమోహామునకు లోనై చేసినదికాదు. మంథర బోధనలకు లొంగిచేసినదికాదు. శ్రీరామచంద్రుని ప్రేరణతో చేసినది. ఆ కార్యాచరణలో తనకు గలిగిన మహాదుఃఖము నోర్చికొని-' యావత్ స్థాస్యంతి గిరయః, సరితశ్చ మహీతలే- 'అంతవరకు భవిష్యద్యుగములలో మాసిపోనితన అపకీర్తిని తెలిసి చేసినది. కైకేయి నిట్లు తీర్చి దిద్దుటకై మొదటి నుండియు కవి జాగ్రత్త పడినాడు. వటువైన రామునకు కైకేయి, 'వ్రజ పుంఖితము వాలుటమ్మ' భిక్షగా పెట్టినది: భిక్షగా పెట్టుటకు దశరథ ప్రియపత్నికి వాలుటమ్మే దొరికినదా! ఆమె పెట్టినది సాభిప్రాయమైన భిక్ష. మిగిలిన ఇరువురు తల్లులు భిక్ష పెట్టినప్పుడు రామచంద్రునకు కలిగిన సంతోషమును కవి వర్ణింపలేదు. కాని, కైక భిక్ష పెట్టగనే-

మొగమున నింతయై మురిసిపోయెను రాముడు, కైక కన్నులం
దిగము మరింత యింతయయి యేళ్లలువారె తదంతరం తర
స్థిగిత రఘూద్వహ ప్రవిలసచ్ఛిశుమూర్తి మరింత యింతయై
జగములు పట్టరానియొక సాహసదీర్ఘతనుత్వ మొప్పగన్.

వారిరువురూ ఒకరినొకరు బాగా ఎరిగినవారు. ఈ రాముడు భవిష్యత్తులో 'దైత్యసంహార గాథా పాండిత్య ముద్ర మూర్తి' కాగలడని కైకవిశ్వాసము. ఆ విశ్వాసముతోనే అతనికి చాప విద్య గరపినది. ఆ విశ్వాసముతోనే అతనిని అడవికంపినది. ఆమెకు కావలసినది భరతుడు రాజగుట కాదు; రాముడడవికేగుట ఆ రామునకు కావలసినదదే. అతని నడవికి పంపించుటలో కైకేయి దుఃఖపడినది, దూషింపబడినది, నిందపడినది, విధవయైనది. అన్నియు నోర్చినదికాని, వనముల కేగవలయునన్న రాముని కోరికను సఫలము చేసినది. ఊరక మంథర బోధనలకు లొంగి, పుత్ర మోహవశయై రామునడవికి పంపెడి దైనచో మరల దశరథుని దుస్థితి చూచి మనస్సు మార్చుకొనవచ్చును; వశిష్ఠులు చెప్పినప్పుడు వినవచ్చును; సుమంత్రుని మాట వినవచ్చును. ఆమెకు కలిగినది పుత్ర వ్యామోహముకాదు; స్వార్థముకాదు. క్లిష్టమైన ఒక కార్యము నిర్వహింపవలసి వచ్చినప్పుడు పరమ ధీరులకైనను కలిగెడి మనః క్లేశము, క్షుద్రమైన హృదయ దౌర్బల్యమును త్యజించి, చివరి వరకు మేరునగ ధీరగా నిలబడినదామె. శ్రీరామ వనవాసవేళ సర్వజనులకు

ఏదో ఒక విధమైన వ్యామోహము క్రమ్ముకొన్నది. కలుగనది ఇద్దరకు. మొదటివాడు శ్రీరాముడు, రెండవది కైకేయి. రామ వియోగ దుఃఖ మామెకు అపారముగా కలిగినది; నిజమే. కాని, ఆ దుఃఖమును ఆమె కర్తవ్యపాలన నతిక్రమించనీయలేదు. తనలోనే అదుము కొన్నది.

తెల్లవారినచో రాముని యౌవ రాజ్యాభిషేకము. ఆ రాత్రి ఉపవాసియై వ్రతనిష్ఠాపరుడైన రామచంద్రుని యెదలో దేవతలాడి- "స్వామికి జ్ఞప్తి యుండదు. ప్రసన్నత కల్గదు. నిర్వికార సత్త్వ మహనీయ వార్ధికిని, దాశరథి సింహము పంక్తి కంధరుండేమయిపోయె, మా మనవులేమయిపోయే, భవత్ప్రతిజ్ఞలూనేమయిపోయె కోసల నరేశ్వరు యజ్ఞ హవిస్సమాహృతిన్' అని యన్నట్లు తోచిన శ్రీ రామచంద్రుడుడు 'మెల్ల లేచి కైకేయి గృహంబులం జనియె'. ఆ వచ్చిన రామచంద్రుని చూచి వ్రతభంగమునకుభయపడిన కైకేయి 'ఇదియే' మని అడుగగా, శ్రీ రాముడు-

అమ్మ! సమాధిలో నిటలమందున వెల్పులు వచ్చి నన్నురా
జ్యమ్మును చేయవద్దనిన యట్లయి తోచిన నేమి తోచకే
నిమ్మెయివచ్చితిన్ నిజమదేమియొ నాకును గూడనట్టిరా
జ్యమ్మునయందు కోర్కియనునట్టిది గుండియ బట్టి లేదెనున్

అని చెప్పగా, రాముని పరిహసించి పంపింతమనుకొన్నది కైకేయి. ఇప్పుడట్లే యుండును. రేపు సింహాసన సీమ ప్రక్కనున్న జానకిని జూచి వేరొక విధముగా నుండును, పొమ్మనినది. ఆ రాముడంత తేలికగా విడివడువాడా! రాజ్యమే చేయవలసినచో' మున్నీవు నువ్వెత్తు నేర్పిన కోదండక భావిచిత్ర గమన శ్రీయేమగుం జెప్పవే! కనలున నన్ములన్ బొమ డికంబున బొమ్మలు చెక్కికొందునా! నను నతిసేయవచ్చిన జనంబుల వ్యూహములన్ బగుల్తునా!' అని యడుగును. (ఇక్కడ ఇట్లన్న శ్రీరాముని అనంతర కాలాన అరణ్యములో ఖరుడు తమ చాపమును విరువగా- 'నీవుంగార్ముక దక్షుడౌదు, నగిషీ ల్వైరిన్ చేయన్, ధనుర్ జ్యావల్లీ కృత చిత్ర కర్షణ నినీషన్ గైకయా దేవి విద్యా విష్కారము నీ మెరుంగవు సుమీ' అని నవ్వును) ఈ మాటలు విన్న కైకేయికి ఆశ్చర్యమైనది. అది యేదో కదిలించిన కొలది మరింత దూరము పోవుచున్నది. 'నీ ధనువున నున్న చిక్కన సుతారము లెందులకోవచింపు' మని కైకేయి యడుగగా, రాముడేమని చెప్పును! నేను విష్ణ్వవతారమును.రావణ సంహారమునకై వనమేగ వలెనని చెప్పునా! శ్రీరామ చంద్రుడు 'తల్లీ! అది కాదమ్మా-

నేను రాజ్యమ్ము చేయుట నిక్కువముగ
లేదవేల్పులకిష్టలే దనంగ
రామచంద్రుని తీక్ష్ణ నేత్రములజూచి
తాను కైకయి సౌధము లోనికేగె.

ఇది అభిషేకము రేపనగా తల్లి కొడుకుల మధ్య జరిగిన సంభాషణ. అప్పుడు మొదలయిన దామె హృదయములో మహాసంగ్రామము.

తెల్లవారుట. మంధరబోధ, వరములు కోరుట- ఇది సామాన్యమయిన కథ. ఆ కథ చదువుటలో కైకేయి మనస్సులోని వ్యథ యంతయు బయట పడును. శ్రీరామ వనవాసము సర్వజనులకు దుఃఖ కారణమయినది. అందరికి తమ దుఃఖము ప్రకటించుకొనుటకు వీలున్నది. ఆమెకు లేదు. ఇంతటి విషమ పరిస్థితిని ఎచ్చటను జారిపోకుండ రచించుటకు కవి గాఢ ప్రతిభాశాలి కావలయును. అందుకే యన్నది-' కవి ప్రతిభలోన నుండును కావ్య గత శతాంశములయందు తొంబదియైన పాళ్లు' అని.

కోపగృహమందు మొదటిసారి చూచినప్పుడు కైకేయి దశరథునకు 'శోకాకృతి'గా కన్పించినది. ఆమెనుగాంచి కళవళపడిన దశరథుడు- 'ఉవిదా! కోపమునందియుంటివని నేనూహించితింగాని ఇంతవు శోకంబు వహించితం బెరుగ, నేలా ఇంత దుఃఖంబు' అనగా, కైకేయి- 'భూదన! కోపం బును శోకమంచనెద, వద్దా! వంచన ప్రక్రియల్' అని యనును. ఇది కైకేయికి తన దుఃఖము ప్రకటించరాని స్థితి. ఇంత దుఃఖపడి పనిచేయు టెందుల కనినచో, అది శ్రీరామచంద్రుల ఇష్టము. దాని వలన పట్టరాని మనఃక్లేశము కలిగినచో, అది ఓర్చు కొనవలయును, అంతే.

నా వరముల మాట. ఏమిటన్నకైకేయితో దశరథుడు- అభిషేకపు టుత్సాహముతో నున్నాడు కదా- కోరు, మేపాటివో నీదు కోరికలు' అన్నాడు. "అనినన్ గైకేయి శోక కోపములు పెల్లై యేడ్వ

భూమీశుడున్, వనితా! చిత్తెర కత్తె వౌదు నిడుగోవాంఛింపు, మే నిత్తు' నన్నను గంపంబును బొంది కైక'' తన కొడుకు రాజుకావలయునన్నచో దశరథుడు వరమిత్తునన్నప్పుడు కైకేయికి సంతోషము కలుగ వలయునుగాని దుఃఖమెందులకు? రాజుపై ప్రసన్నత కలుగవలయునుగాని దుఃఖమెందులకు? కోరుమని రాజు రెట్టించినప్పుడు కంపమెందులకు? శ్రీరామ వనవాసము క్షణ క్షణము నిశ్చయమై పోవుచున్నది. ఇది ఆమె దుఃఖము. దశరథుడు మరింత దానికి కారణమగుచున్నాడు. ఇది ఆమె కోపము. ఆమె ఏడ్పు అది యొక హాఠమని దశరథుడు తప్పుగా నర్థము చేసికొన్నాడు. ''కంపంబును బొంది కైక 'ధరణీంద్రా! యిత్తు నన్నంత చుల్కనగా దిచ్చుట' యన్న భూమిపతియున్ కన్నుల్ సెరల్ కెంపులై', తానెత్తిన పథకము దశరథునికి తెలియదు. తానన్నమాట యత్నికి తగలవలసిన చోట తగిలినది. రోషగ్రస్తుడై ఆ మూఢుడు మరియు ఘోరమయిన ప్రతిజ్ఞగా రామునిపై నొట్టిడుకొను చున్నాడు. ఇక దశరథుడు వెనుదిరుగుటకు వీలులేదు.

ఆ మాటల్ వినుచున్ లత్ాంగి భయ భీతాక్షుల్ విదారించి, యో
మా వోర్తాండ ముఖాళి లామరచమూ! యో భూత సంతానమా!
మీ మీ సాకిరి భావముల్ గనుడు భూమీనేత. ఈ దృక్కృతి
జ్ఞా మోహావిల పారవశ్య కలితా జ్ఞావశ్యుడై పల్కెడున్.

అని తన వరములు కోరినది కైకేయి.

ఇంతవరకన్ని విధములుగా మాటాడిన కైకేయి తరువాత దశరథుడు శోకించినను, దూషించినను, వాదించినను, బ్రతిమాలినను ఒక్కమాట మాటాడదు. 'క్ష్మాతలేంద్రుడు దుఃఖ వాచాలుడైన, తరుణి కైకేయి దుఃఖ నిస్తబ్ధయయ్యె' తనకని తానెట్లో నిలువ ద్రొక్కకొని చేసినది. ఇక మిగిలినది శ్రీరాము డనుష్ఠింపదగినది. ఆ రాముడన్న మాటలివి.

'నీ యుపకారముల్ మరువనే, మరి యోజననీ...'
'ఏ వరయుగ్మ మీ వడిగి తేవరయుగ్మము రాజొసంగనే
నా వరయుగ్మ పాలన కృతార్థ జనుష్కుడనైతినేని, నా
యా వర పాలనోత్థ సుకృతా ఖిల దివ్యతయందు తల్లి శ్రీ
దేవత నీవు, నన్నను మతింపుము నీదు సదార్చకుండుగా'

ఆమె పడుచున్న కష్టమతనికి తెలియును. ఆ కష్టము తన కోసము పడుచున్నదనియు తెలియును. అంత అయోధ్యలో ఆమెను దూషింపనివారు లేరు. ఆమె శిలవోలెయైనది. ఆమె దుస్థితి తెలిసినవాడొక్కరామచంద్రుడు. అతని హృదయమామె యెడ పరమస్నిగ్ధమై, అతడామె ననునయించును- 'తల్లీ! బాధపడకు. పుత్రుని కతముననగు బాధలు జనని సహింపకయ యేరు సైరింతురు!' అని, చివరకు వనప్రస్థాన వేళ రామచంద్రుడు.

'... కైకేయి పదమ్ము లందుకొని నీ నాశీస్సు లీకున్నచో బో
వ, నటన్నన్ బినతల్లి మూర్చగని లిప్తందేలి పోవోయి నీ
వనముల్ నా కొడుకిందు రాజగును, నీ బాహోధనుః క్రూర మా
ర్గణముల్ చేయు నుపద్రవంబున మహా కాంతారముల్ ఘోషిలున్
నిరభిమానను నిర్లజ్జ నిర్భయాత్మ
జేసితివి నన్ను, సర్వ సన్యాసినిన్ వ
నికి జనుమిర సవతి తల్లినిన్ ననున్ శ
పించి సవతి తల్లిగనె చూపించినావు''

ఈ మాటలలో ఆమె భవిష్యజ్జీవితములోని వైయర్థ్యమంతయు ధ్వనించు చున్నది. ఆ మాటల కూర్పట్లున్నది. రాముడు తన వనమునకు తాను పోవలయును. అక్కడ ఆతని బాణములు చేయను ఉపద్రవమువలన మహాటవులు ఘోషిల్లును. కాని, తానో! నిరభిమానగా, నిర్లజ్జగా, నిర్భయాత్మగా, కేవలము సవతి తల్లిగా మిగిలిపోవును. ఇది రాముడు చేసినపని. తాను సర్వ సన్యాసినియైనది.

'అనిన నందరు ఛీ ఛీ యనిరి. తల్లి చివరిదాక రక్షించుటకు రాముడు సంతసించె'

ఇది కల్పవృక్షములో కైకేయి రామచంద్రుల సంబంధము. రామాయణ గాథలో రామచంద్రుని నిజ స్వరూపమును కొందరు ఋషులే ఎరుగుదురు. ఇక్కడ వారితోబాటు కైకేయి గూడ ఎరుంగును. రామచంద్రుని బదులు నేనే అరణ్యమునకు పోదునన్న భరతుని జూచి ఆమె జాలిపడినది. అతనితో ననుచున్నది.- "నీవేగి కానన, మేమోదువు? రామచంద్రుడనిన్ ద్రాంశు తేజోని మూతన నారాయణ మూర్తి శాసిత సమస్త ప్రాణి, నీవేగుటా తనిదొవిగుట ఎక్కడ?" అనిఇది ఆమె ఎరుక. ఆమెపుత్ర వ్యామోహ విచలిత బుద్ధికాదు. సుగ్రీవాంగద జాంబవదాది మహావానరాదుల వలె రామకార్యమందే జన్మ చారితార్థ్యమును భావించిన తల్లి.

ఒక మహా కావ్య రచనలో రచన అనేక విధములుగా సాగును. ఒకచో నది పరమ మధురముగా ఉండును, మరొక చోట మిక్కిలి కఠినముగా నుండును. ఒకచోట వట్టి వాక్చమత్కృతి మరొక చోట అనంత కల్పనా వైభవము. ఒక చోట.బాహిరముగా కనబడుచున్న వస్తువును వర్ణించి కథాగతమైన ఒక వ్యక్తి మనఃస్థితిని వ్యక్తీకరించుట యుండును. ఇట్లెన్నని? అన్నిటి నుదహరించుట కిక్కడ ఇరుకు.

అందుముగా హోయల్ వెడలు నట్లుగ నొక్కకచో దరంగ సా
లిందుమికించుచున్ విధుర లీలను నొక్కొకచో, నొకొక్కచో
చిందుచు వక్రమై నిడివి చెన్నుల పాయలుగా నొకొక్క చో
మందముగా ద్రుతమ్ముగ శ్రమమ్ముగ సౌఖ్యముగాగ నేగగా.

ఇది గంగానదిని గురించిన పద్యము. ఆ నది నడక వలెనే ఈ కల్ప వృక్ష రచన యుండును.

'క్వచిదష్టాపద వర్ణ సైకత, క్వచిత్సాధోధి గంభిరయున్
క్వచి దుద్భ్రాంత విహంగ సంతతి, క్వచిత్కాశ ప్రసూనాచ్ఛయున్
క్వచిదానీత తుషార శీతల, క్వచిత్క్రమ స్వర వ్యాప్తయున్
క్వచిదాకాశ విశాల భావకృత దృక్తాత్పర్య కృష్టాత్మయున్.'

ఇదియు గంగానది గురించిన పద్యమే. రామాయణ కల్పవృక్షములో కవిత్వ మట్లుండును. పచ్చ బంగారము కుప్పలు పోసినట్లు, గంభీరమైన సముద్రము లోతందనట్లు, ఉద్భ్రాంతమైన పక్షిసంతతులు కూవెట్టినట్లు, రెల్లు పూవులు సన్నగాలులకు కదలులాడినట్లు, నిదాఘతప్తుడైనవాడు జలపాతము వద్ద నిలుచున్నప్పుడు పైకి చిమ్మిన జల్లులచే మేనంతయు పరమ సౌఖ్యము చెందినట్లు, వీణ తంత్రిమీద వ్రేలితో నిటుకొట్టి అటు మెట్టు మీద నదిమి లాగినచో పుట్టిన యొక ధ్వని సాంతత్యము హృదంతరాళము లోనికి చొచ్చుకొని పోయి యటు చోటు చేసికొన్నట్లు- ఈ సుఖమంతయు కల్పవృక్షము కవిత్వములో నున్నది. 'క్వచిదాకాశ విశాల భావకృతదృక్తాత్పర్య కృష్టాత్మయున్.' దీని యర్థము భావించవలసినదేగాని, చెప్పుట కష్టము. కష్టము పద కాఠిన్యము వలన కాదు. పద కాఠిన్యమును నిముసములో భేదింపవచ్చును. కాని, ఒక గూఢమయిన, ప్రౌఢమయిన భావమును పట్టుకొనుట కష్టము. నదీ వైశాల్యమెక్కువగా నున్నచోట ఆవలి యొడ్డును ఆకాశము చుంబించు చుండగా, ఈ నడిమి వైశాల్యము భావింపగలిగినచో, కొంత ఈ కల్పవృక్ష కవితా వైశాల్యమును భావించినట్లగు ననుకొనుచున్నాను. ఆ సమాసమునకు అర్థముగూడ కొంత కొంత భావింపబడినట్లగు నను కొనుచున్నాను. వ్యుత్పత్తిచేత గాక, టీకచేత గాక, భక్తి చేత సాధింపవలెననగా నిదియే. దాని ననుసరించుటకు ప్రయత్నము చేసినచో ఆ కవితాదేవి మనకు ప్రసన్నమైనప్పుడు కలిగెడి ఆనందము వర్ణనా తీతము. రామాయణ కల్పవృక్షములోని కవితా వైశాల్య మెంతటి దనగా, పది, పదిమంది, పది, పది దృక్కోణములతో పదుల గ్రంథములు వ్రాయుటకు వలసిన సామగ్రి అచ్చటనున్నది. ఇది విశ్వవిద్యాలయములు చేయవలసిన పని (?).

ముగించుటకు ముందు మరియొక సంగతి ప్రస్తావింతును.

రామాయణములోని రాక్షసులొక విశిష్ట మనః ప్రవృత్తికలవారు. శాపగ్రస్తులైన రాక్షసులు వారు. విరాధు డట్టివాడే; కబంధుడట్టివాడే. ఆయా ఘట్టములు చదివినచో- శాపాంతమెప్పుడని వారెదురు చూచుట, రాముని దర్శనమునకై వారుపడిన తహతహ, చెట్టులో, చేమలో, పక్షిలో, మృగములో భగవంతుడైన రాముని కొరకు వెదకి, అతడు దొరకక కబంధుడు పడిన ఆర్తి- ఇవన్నియు అర్థమగును.

రావణుడు తపస్సంపన్నుడు. యుద్ధకాండములో మొదటిది సంశయఖండము. చివరిదైన 'ఉపసంహరణ'కు ముందుది నిస్సంశయ ఖండము. తాను విరోధింపవలసినది విష్ణ్వవతారమయిన వానితో ఈ రాముడు వాడగునా, కాదా? మనస్సులో ఈ సంఘర్షణ రావణునకు నిరంతరము కలుగుచునే యుండును. సీతాదేవితో రావణుడు మాట్లాడుట దేవీ భక్తుడు ఉపాస్య అయిన ఆ దేవితో మాట్లాడినట్లుండును.

నిజముగ జూడు రామతరుణీ! శివునిం గికురించినాడ కం
ఠజ నవరక్తవారి విలుతత్తల మూర్ధములే యొసంగి, యం
బుజ సదృశంబు నీ చరణ మోహన పీఠమునందు నాదు ప
ర్వజని ఫలంబునర్పణము పట్టితి, ముట్టితి శ్రీరహస్యమున్.

ఆ యర్థమా మహానుభావునికి వచ్చుచుండును. 'తెలిసిన మూరు ఖడు'అని రావణుని గురించి లోకములో ననుకొను మాటలో చాలా అర్థమున్నది. ఈ కల్పవృక్షములోని రావణుని గురించి వ్రాసినచో మరల నింతయగును. ఎక్కువయే యగును.

కల్ప వృక్షములోని కుంభకర్ణుని యుద్ధరచన- అది యొక ఆశ్చర్యము. రాముని సమీపించుటకైవాడు పడిన తపన అంతయు ఆ రచనలో నున్నది.

ఇవన్నియు, ఇంక నిన్నిన్నియు ఎవరికి వారు చదివి భావించి గ్రహింపవలసిన విషయములు. మరొకడు చెప్పినప్పుడు 'కావచ్చు' ననిపించునుగాని, ఆ యానందము కలుగదు. ఈ కల్ప వృక్ష కావ్యము 'భక్తి యున్నట్టిచో మెత్తబడెడు దేవి! సుభద్ర, సమార్ద్ర. దీని పఠనము వలన కలిగిన ఆనందములో పాఠకులకు పాలు పంచుటకై ఇది నేను చేసిన ప్రయత్నము. అపండితుడనైన నా యీ సాహసమును మన్నింపవలసినదని పరమ వినీతుడనై ప్రార్థించుచున్నాను.

ఎదకు పురాంధ్ర సంస్కృత కవీశ్వర భారతి దీప్తి కల్గినన్
సదమల బుద్ధికిన్ సకల శాస్త్ర రహస్య వివేక మబ్బినన్
మదికి 'ననంత కల్పనల మక్కువ గల్గిన, విశ్వనాథ శా
రద సకలార్థదాయిని సురద్రుమ రాము కథన్ భజింపుమా!